ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
కర్ణాటక వార్తలు
సోమవారం 7 ఏప్రిల్ 2025



మహిళా పారిశ్రామికవేత్తల సదస్సుకు రాష్ట్ర బృందం

బెంగళూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మహిళా పారిశ్రామిక వేత్తల ప్రోత్సాహకానికై పనిచేస్తున్న ఉబుంటు ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు రాష్ట్రబృందం వెళ్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్య దర్శి, ఉబుంటు ఫౌండర్ సెక్రటరీ రత్నప్రభ నేతృత్వంలో జమ్ము-కశ్మీర్‌లో సదస్సు జరగనుంది. 13 విభాగాల సాధనలకు సంబంధించి మహిళా పారి శ్రామికవేత్తలు పాల్గొంటున్నారు. ఈనెల 7నుంచి 9 వరకు జరిగే సదస్సులో 11 రాష్ట్రాలనుంచి 30వేలమంది భాగస్వాములు కానున్నారు. రాష్ట్రం నుంచి మహిళా పారిశ్రామికవేత్తల బృందం బయల్దేరింది.



గాలి ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులు



బళ్లారిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణవైభోగమే..!

● ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

రామనామం మార్మోగింది.. వాడవాడలా జై శ్రీరామ్..జై శ్రీరామ్ అంటూ నినాదాలు వినిపించాయి. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. సీతారామలు కల్యాణాన్ని రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. అడుగడుగునా పానకం, వడపప్పు పంపిణీ చేసి దాతలు భక్తిని చాటుకున్నారు. బళ్లారి శోభాయాత్రలో జనం విశేషంగా పాల్గొన్నారు.



ఊరేగింపులో యువతుల నృత్యం



గాలి ఆంజనేయస్వామి మూలవిరాట్టు



పద్మనాభనగర్‌లో మజ్జిగ పంపిణీలో ప్రతిపక్షనేత అశోక్



మహదేవపురలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



● కాంగ్రెస్ నాయకులకు రాహుల్ మందలింపు
● హనీట్రాప్ వ్యవహారంపై చీవాట్లు
● 4 ఎమ్మెల్సీ స్థానాలకు సీఎం సిఫారసు
● సీఎం, డీసీఎం మధ్య కుదరని సయోధ్య..!

హైకమాండ్ ఆగ్రహం..!





బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం, డీసీఎంల తీరుపై అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఢిల్లీలో కర్ణాటక భవన్ (కావేరి) ప్రారంభోత్సవానికి సీఎం, డీసీఎంలు వెళ్లి మూడు రోజులు గడిపారు. ఇదే సందర్భంలోనే సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని కలిశారు. ఈ సందర్భంలోనే రాష్ట్రంలో తాజా పరిణామాలపై రాహుల్‌గాంధీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రధానంగా హనీట్రాప్ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఏకంగా ఓ మంత్రి శాసనసభలో హనీట్రాప్‌కు గురయ్యానని చెప్పారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో పరిశీలించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిణామాలు ప్రభుత్వానికే కాదు పార్టీకి తీరని నష్టం కలిగిస్తాయని మందలించినట్లు తెలుస్తోంది. మరోసారి నాగేంద్రను మంత్రిని చేసే అంశానికి రాహుల్‌గాంధీ ససేమిరా అన్నట్లు విశ్వసనీయ సమాచారం. వాల్మీకి కార్పొరేషన్‌లో వందల కోట్ల రూపాయల అవినీతి అంశం ఇంకా విచారణ దశలో ఉందని అప్పుడే అవకాశం సరికాదని కూడా పేర్కొన్నట్లు తెలుస్తోంది. నాలుగు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి సంబంధించి మల్లికార్జున ఖర్గేతో చర్చించాలని సూచించినట్లు తెలుస్తోంది. పలువురి పేర్లను సిఫారసు చేసినట్టు తెలుస్తోంది. వీరిలో ఒక్కలిగ సామాజికవర్గానికి చెందిన బీఎల్ శంకర్, రఘునందన్ రామణ్ణ, వినయ్ కార్తీక్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. బీఎల్ శంకర్‌ను ఎమ్మెల్సీని చేసి సభాపతిగా చేయాలని ప్రతిపాదన ఉన్నట్టు సమాచారం. అయితే ఒక్కలిగ కోటాను వదులుకునేందుకు డీసీఎం డీకే శివకుమార్ సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. బీఎల్ శంకర్‌కు చోటు దక్కేది అనుమానంగా ఉంది. ప్రస్తుతం పరిషత్‌లో కాంగ్రెస్‌కు 33మంది బలం ఉండగా నలుగురిని నామినేట్ చేయడం ద్వారా 37కు చేరవచ్చునని వివరించినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల కోటాలో రీ కౌంటింగ్‌లో గాయత్రి శాంతేగౌడ గెలుపు సాధ్యమని అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఇదే చిక్కమగళూరు స్థానం నుంచి గాయత్రిగౌడపై గెలుపొందిన ఎంకే ప్రాణేశ్ ఉప సభాపతిగా వ్యవహరిస్తున్నారు. అయితే ఢిల్లీ నుంచి వెనుతిరిగి వచ్చిన సీఎం అధిష్ఠానంతో చర్చలకు సంబంధించి ఏ అంశాలను మీడియాతో ఇంతవరకు ప్రస్తావించలేదు.

తెలుగు, కన్నడ భాషల అనుబంధం ఎనలేనిది

● రాయల కాలం నుంచి వైభవం ● ఉగాది ఉత్సవాలు హర్షణీయం ● ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



నటులను పురస్కారాలతో సత్కరిస్తున్న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు కన్నడభాషల అనుబంధం రాయలకాలం నుంచి కొనసాగిందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు అన్నారు. తెలుగు విజ్ఞానసమితి ఆధ్వర్యంలో 72వ ఉగాది ఉత్సవాలు ఆదివారం వయ్యాలికావల్‌లోని శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో జరిగాయి. సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు అధ్యక్షత వహించగా టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్, సమితి విద్యాసంస్థల అధ్యక్షులు కె శ్యామ రాజు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ తెలుగుభాషకు గౌరవం తీసుకొచ్చింది శ్రీకృష్ణదేవ రాయలని, తెలుగువారి ఇష్టదైవం తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం ఆయన హయాంలోనిదే అన్నారు. భాషతోపాటు సంస్కృతి, శిల్ప కళలకు రాయలు ఎంతో ప్రోత్సహించారన్నారు. తెలుగు, కన్నడ రెండుభాషల మధ్య సారధిగా ఎందరో సాధకులు ఉన్నారని కొనియాడారు. 72ఏళ్లుగా ఉగాది ఉత్సవాలు జరపడం సంతోషమన్నారు. నటుడు సాయి కుమార్ చిరకాల మిత్రుడని, ఆయన 50ఏళ్ల సినీరంగ ప్రస్థానం సంతోషమన్నారు. ఉత్సవాలలో పాల్గొనడం సంతోషంగా భావిస్తున్నానన్నారు. ఇదే సందర్భంగా ప్రముఖ కన్నడ నటుడు, రాజ్యసభ సభ్యుడు జగ్గేశ్‌కు శ్రీకృష్ణ దేవరాయల పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జగ్గేశ్ మాట్లాడుతూ తెలుగు, కన్నడ ప్రజల డీఎన్ఏ ఒక్కటే అన్నారు. రాయల పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. నటుడు సాయికుమార్ సన్మానం తర్వాత మాట్లాడుతూ చెన్నైలో జన్మించినా తెలుగు, కన్నడ భాషలు మా కుటుంబానికి కీలకమన్నారు. తండ్రిది ఆంధ్రప్రదేశ్ కాగా తల్లి బాగేపల్లికి చెందినవారన్నారు. ఇలా తమ కుటుంబంలో రెండు భాషల సినిమాలలోనూ రాణిస్తున్నామన్నారు. నా సోదరులు శాండల్‌వుడ్‌లో ప్రముఖ నటులన్నారు. 11ఏళ్లకే నటన ప్రారంభించానని, ఎస్వీఆర్, ఎన్టీఆర్ వంటి దిగ్గజనటుల ఆశీస్సులతో ఎదిగానన్నారు. వెయ్యికిపైగా సినిమాలకు డబ్బింగ్ చెప్పానన్నారు. పౌరాణికంతోపాటు తెలుగ, కన్నడ భాషలలో ఆయన నటించిన సినిమాల డైలాగ్‌లతో సభికులను ఆకట్టుకున్నారు. సమితి అధ్యక్షులు మాట్లాడుతూ 1956 భాషాప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ్డాయని కానీ త్రిభాషాసూత్రం కోసం ఏటా పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. పొరుగున ఉండే అనంతపురం జిల్లాలోని కన్నడ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని డిప్యూటీ స్పీకర్‌ను సభాముఖంగా కోరారు. ఏటా కోర్టు నుంచి స్టే తెచ్చుకుని మాతృభాషలో పరీక్షలు రాసే పరిస్థితి ఉందని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమితి ముఖ్యులు గంగరాజు, లక్ష్మిరెడ్డి, వరదరాజు, మయూరి సంస్థల యజమాని చెన్నారెడ్డి, రమణబాబు, క్రిష్ణయ్యనాయుడు, ఉమాపతినాయుడు, నరసింహమూర్తి, జయచంద్రారెడ్డి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన కాకర్లపూడి శృతి సమన్వి, అభిజ్ఞమంగలంపల్లిల కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కారు డివైడర్‌ను ఢీకొని..

ముగ్గురి దుర్మరణం

బెంగళూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ముగ్గురు మహిళలు దుర్మరణం చెందారు. హావేరి నుంచి హుబ్బళ్ళివైపు వస్తున్న కారు పూనె-బెంగళూరు జాతీయ రహదారిపై హుబ్బళ్ళి పరిధిలోని నూల్వి క్రాస్ వద్ద ఆదివారం ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో సుజాత హిరేమఠ్ (60), గాయత్రి మాంతనమఠ (67), శకుంతల హిరేమఠ (72) మృతి చెందినవారు. సంపత్ కుమారితోపాటు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హుబ్బళ్ళి కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైనవారంతా లింగరాజునగరానికి చెందినవారిగా తెలిసింది.





ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య, విద్యుద్దీప కాంతుల్లో విధానసౌధ

అందరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : సీఎం

బెంగళూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమాలు అందాలన్నది తమ ఆశయమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. విధానసౌధకు వెలుగుల శోభ పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక లైటింగ్‌ను సీఎం లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, డీసీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు అయినా సమానత్వం సాధ్యం కాలేదన్నారు. పార్లమెంటు, అసెంబ్లీలు సమస్యలపై చర్చించి పరిష్కారం చూపే ఆలయాలన్నారు. ప్రభుత్వ పని దేవుడికి సేవ చేసినట్టు అని ప్రతి ఉద్యోగి భావించాలన్నారు. విధానసౌధకు శాశ్వతమైన లైటింగ్ విధానం సమకూర్చిన స్పీకర్ యూటీ ఖాదర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మంత్రులు కేజే జార్జ్, హెచ్‌కేపాటిల్‌తోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు పాల్గొన్నారు.

బోవి కార్పొరేషన్ మాజీ ఎండీ అరెస్టు

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బోవి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల అవినీతికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారణలో భాగంగా శనివారం దాడులు చేశారు. మాజీ ఎండీ బీకే నాగరాజప్పను అరెస్టు చేసినట్టు ఈడీ ఒక ప్రకటనలో పేర్కొంది. 14రోజుల కస్టడీకి తీసుకున్నట్లు తెలిపింది. అంబేడ్కర్ రోడ్డు వీవీ టవర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంతోపాటు పలువురు అధికారులపై దాడులు జరిపిన తర్వాత అరెస్టు చేశారు. కార్పొరేషన్ ద్వారా పథకాలు, రుణాల మంజూరు కోసం దళారుల ద్వారా భారీగా వసూళ్లకు పాల్పడ్డారు. చెక్కుల రూపంలోనూ లంచం తీసుకున్న ఆధారాలకు అనుగుణంగా అరెస్టు చేసినట్టు ఈడీ ప్రకటించింది.

శెభాష్ పోలీస్

● రెండ్రోజుల్లోనే దారి దోపిడీ కేసు ఛేదింపు

వి.కోట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధి నాయకనేరి అటవీ ప్రాంతంలో జరిగిన బంగారం దారి దోపిడీ కేసును రెండ్రోజుల్లోనే పోలీసులు ఛేదించి శభాష్ అనిపించుకున్నారు. బుధవారం రాత్రి అటవీ ప్రాంతంలో దోపిడీ జరిగిందన్న సమాచారంతో అప్రమత్తమైన వి.కోట పోలీసులు ఎస్పీ మణికంఠ ఆదేశాలతో నాలుగు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన ప్రధాన నిందితుడు అక్కడి కాంగ్రెస్ పార్టీ 4వ వార్డు కౌన్సిలర్ జయపాల్‌ను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 3.5 కిలోల బంగారం బిస్కెట్లను రికవరీ చేశారు. ఆదివారం చిత్తూరులో ఈ వివరాలను ఎస్పీ మీడియాకు తెలిపారు.

ముందస్తు ప్రణాళికతో..

కేజీఎఫ్‌కు చెందిన ఈ ముఠా ముందస్తు ప్రణాళికతో మార్వాడీ వద్ద ఉన్న డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో తమిళనాడులోని మరికొందరితో కలసి దారి దోపిడీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదుతో దొంగల ముఠా కదలికలను పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకుని, బంగారాన్ని రికవరీ చేశారు. ఇంకా 250 గ్రాముల బంగారం రికవరీ చేయాల్సి ఉందని, దానికోసం ప్రత్యేక పోలీసు బృందాలు అన్వేషణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. కాగా, కేసు ఛేదనలో చొరవ చూపిన పలమనేరు డీఎస్పీ డి.ప్రభాకర్, వి.కోట అర్బన్ సీఐ సోమశేఖర్, వారికి సహకరించిన ఇతర పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు. అలాగే జిల్లా పోలీసులకు కర్ణాటకకు చెందిన మార్వాడీలు, బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జయపాల్ కర్ణాటక పోలీసులను ముప్పతిప్పలు పెట్టాడని.. ఎట్టకేలకు ఆంధ్ర పోలీసులు పక్కా ఆధారాలతో అరెస్టు చేయడంపై అభినందనలు తెలిపారు.



డీఎస్పీకి కృతజ్ఞతలు తెలుపుతున్న కర్ణాటకకు చెందిన మార్వాడీలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.43	1,579.63
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	4,500	928
నీటి నిల్వ (టీఎంసీలు)	7.61	4.29

హత్య కేసులో
నిందితుల అరెస్టు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆంధ్రా రోడ్డు కేటీ ప్రజ్వల్ కాటన్ మిల్ ముందు ఈ నెల 5వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని రాణితోటకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి దారుణహత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు బాలురలతో పాటు 11మందిని బ్రూస్‌పేట పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులు వెంకటేష్‌ను కట్టెలు, మచ్చు, రాళ్లతో ఛాతీ, తల, వెన్నుపై ఇష్టమొచ్చినట్లు కొట్టి తీవ్రంగా గాయపరిచి హత్యచేసినట్లు పోలీసు విచారణలో తేలిందని ఎస్పీ వివరించారు. హత్యకు కారణమైన నీలవేణి, ఆనంద్, మహ్మద్ గౌస్, శివశంకర్ అలియాస్ చిరు, మహ్మద్ సాహిద్ అలియాస్ జంగ్లి, పాషావలి అలియాస్ దుద్దు, మహ్మద్ శరీఫ్, మహ్మద్ ఆసిఫ్, మహ్మద్ సోహెల్, ఇద్దరు చిన్నారులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ వివరించారు. హత్యకు ఉపయోగించిన రెండు మోటారు సైకిళ్ళు, ఒక డియో స్కూటర్, 5 మొబైల్ ఫోన్‌లు, 2 మచ్చుకత్తుల, మూడు కట్టెలు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.



బళ్లారి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



అభయాంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

మార్మోగిన రామనామం..!

బళ్లారి సిటీ/రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రామనామం మార్మోగింది.. సీతారాముల కల్యాణం వాడవాడలా వైభవంగా నిర్వహించారు. ఉభజిల్లాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. శ్రీరామ నామజపంతో ఆలయాలు దద్దరిల్లాయి. తరలివచ్చిన భక్తులకు పానకం, వడపప్పు అందజేశారు. క్యాంపులు, గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా పండగ సంబరాలు జరుపుకున్నారు. నగరంలోని మోతి సర్కిల్ రామాలయం, మిల్లర్‌పేట ఆంజనేయస్వామి ఆలయాలను సుందరంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. సిరుగుప్ప రహదారిలోని రామనగర్‌లో కొలువు దీరిన కోదండరామ దేవస్థానంలో శ్రీరామ నవమి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల దర్శనానికి భక్తులు పోటెత్తారు.

కంప్లి : తాలుకా పరిధిలోని గ్రామాల్లో, క్యాంపులో ఆదివారం శ్రీరామనవమి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాల్లో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిరణ్‌కుమార్ శాస్త్రి, గిరీష్, పురోహితులు చేత వివిధ ధార్మిక కార్యక్రమాలు పూజలు నిర్వహించారు. శిల్ప, సత్యసాయి, తులసి, శివ ఈ రెండు జంటల చేత సామూహిక సీతారామ కళ్యాణోత్సవం నిర్వహించారు.





మిల్లర్‌పేట ఆంజనేయ స్వామి ఆలయంలో అలంకరణ

సిరుగుప్ప: సిరుగుప్ప పట్టణంలో పేట్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్యామాచార్య ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అన్నదాన సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.

తోరణగల్లు: సండూరు తాలుకా వ్యాప్తంగా శ్రీరామనవమి పండుగను భక్తులు, ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తోరణగల్లు స్టేషన్‌లోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు.



హోటల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి

‘స్పా’ ముసుగులో వ్యభిచారం

- బళ్లారిలోని ప్రముఖ హోటల్‌పై పోలీసుల దాడులు
- ముగ్గురు చొప్పున మహిళలు, విటుల అరెస్ట్

బళ్లారి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న హోటల్‌పై పోలీసులు కొరడా ఝులిపించారు. బళ్లారి నగరంలో ప్రముఖంగా పేరుగాంచిన హోటల్ బాల రెసిడెన్సీపై దాడులు నిర్వహించి వ్యబిచారం సాగిస్తున్న ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులను ఆదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ శోభరాణి తెలిపారు. ఓ అజ్ఞాత వ్యక్తి పోలీసులకు ఫోన్ చేసి ఇచిచన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఇందుకు సైబర్ క్రైం డీఎస్పీ సంతోష్ చౌహాన్ ఎస్పీ శోభరాణి ఇతర పోలీసుల నేతృత్వంలో శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. హోటల్‌లోని చివరి అంతస్థుల్లో ఉన్న గదుల్లో పోలీసులు దాడులు చేశారు. ముగ్గురు మహిళలు ఇతర రాష్ట్రాలకు చెందినవారు, పురుషులను స్థానికులుగా గుర్తించారు. హోటల్ యజమానితో పాటు మరో నలుగురిపై నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. నగరంలో పేరొందిన హోటలపై దాడులు జరగడం చర్చనీయాంశమయ్యింది. స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



బాలా రెసిడెన్సీ హోటల్

గ్రామాల్లో నమో డ్రోన్ దీదీ ప్రాజెక్ట్



వరి పంటపై డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేస్తున్న బృందం

గంగావతి రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ‘నమోదీదీ’ పథకం ద్వారా లబ్ధి పొందిన గంగావతికి చెందిన డ్రోన్ స్నేహితుల బృందం ఇప్పుడు ఆత్మగౌరవ జీవితంతోపాటు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించింది. డ్రోన్ సఖీ బృందంలో 12మంది మహిళలు ఉన్నారు. వీరందరూ డ్రోన్ ఫ్లయింగ్ శిక్షణ, లైసెన్స్‌లు పొందారు. తాలూకాలో డ్రోన్లను ఉపయోగించి రైతుల పంటలపై పురుగుమందులు పిచికారీ చేయడం ద్వారా డ్రోన్ ఔత్సాహికులు మంచి ఆదాయాన్ని సంపాదిస్తూ స్వయం సమృద్ధి సాధించారు. గంగాతి, కుకనూర్ తాలూకాకు చెందిన 12మంది మహిళలు మైసూర్, హైదరాబాద్, చెన్నైలోని ఏరోనాటిక్స్ కేంద్రాల్లో పలు కంపెనీల్లో శిక్షణ పొందినట్లు తాలూకా మేనేజర్ ముద్దనేష్ తెలిపారు. డ్రోన్ ద్వారా ఎకరం మందును 10నిముషాల్లో పిచికారీ చేస్తారు. ఓ కార్మికుడు 2రోజుల్లో చేసేపనిని డ్రోన్ 45నిముషాల్లో చేస్తుందన్నారు. డ్రోన్ సఖి నాగరత్న మాట్లాడుతూ ఒక ఎకరానికి 8-10 లీటర్ల నీటినిఉపయోగించి పిచికారీ చేయవచ్చన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



బసవేశ్వర క్యాంపులో సీతారామ కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సన్నాపురం వద్ద కోదండరామస్వామి ఆలయంలో అలంకరణ



అలంకరణలో హనుమంతుడు



సిరుగుప్పలో..



విద్యానగర్‌లో..



తోరణగల్లులో సీతారాముల కల్యాణం

వైభవంగా నాగనాథేశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కురుగోడు సమీపంలోని సిరిగేరి గ్రామంలో ఆదివారం నాగనాథేశ్వర స్వామి వైభవంగా జరిగింది. ఉదయం నుండి సాయంత్రం వరకు పార్వతిదేవికి నాగనాథేశ్వరస్వామికు ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలో ముత్తయిదువ మహిళలు కలశాలతో ఆలయాలకు చేరుకుని పూజలు చేపట్టారు. సాయంత్రం నాగనాథేశ్వర ఆలయం నుండి ఎదురు బసవన్న కట్టా వర్క్ రథాన్ని వేలాది భక్తుల మధ్య ఊరేగించారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా సిరిగేరి పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. సిరిగేరితో పాటు సిరుగుప్ప, బళ్లారి, కురుగోడు, కంప్లి గంగావతి హోస్పేట, సండూరు ఆంధ్రప్రదేశ్‌లోని హోలగుంద, ఆలూరు, ఆదోని చుట్టుపక్కల గ్రామాలు పట్టణాల నుండి భారీ ఎత్తున భక్తులు పాల్గొని పూలు, పండ్లతో స్వామివారి రథోత్సవానికి మొక్కులు సమర్పించుకున్నారు.



ప్రత్యేకాలంకరణలో నాగనాథేశ్వర స్వామి

సిరిగేరిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



నేతల ఆకాంక్షలను మరుగున పెడుతున్న ప్రభుత్వాలు

- ఏఐడీఎస్ఓ రాష్ట్ర కోశాధికారి సుభాష్ బెట్టదకొప్ప ఆగ్రహం



మాట్లాడుతున్న సుభాష్ బెట్టదకొప్ప

బళ్లారి సిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర భారత దేశం కోసం భగత్‌సింగ్, నేతాజీ వంటి గొప్ప వ్యక్తుల ఆకాంక్షలను నేటి ప్రభుత్వాలు మరుగున పెడుతున్నాయని ఏఐడీఎస్ఓ రాష్ట్రకోశాదికారి సుభాష్ బెట్టదకొప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని రాఘవకళామందిరంలో ఆదివారం ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో జరిగిన సదస్సు రెండోరోజు కార్యక్రమంలో ఆయన సమాజంలో విద్యార్థుల పాత్రపై మాట్లాడారు. నేడు సమాజంలో ఉన్నత సంస్కృతి, విలువలు లేకపోవడంతోపాటు ప్రభుత్వాలు కూడా ఆదర్శాలు లేకుండా ప్రవర్తిస్తున్నాయన్నారు. సమాజంలో మనం అనుభవిస్తున్న ప్రతి సౌకర్యం ఈసమాజంలోని కార్మికుల కృషిఫలితమేనన్నారు. అనంతరం జిల్లాధ్యక్షుడు కే.ఈరన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 50వేల సంతకాల సేకరణ ప్రచారానికి పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యను కాపాడే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలన్నారు. ఈశిబిరంలో జిల్లాకార్యదర్శి కంబలి మంజునాథ్, జిల్లాఉపాధ్యక్షులు శాంతి, ఉమ, నిహారిక, సభ్యులు సమీర్, మోహన్, ఖాసీం, నవీన్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



అన్వర్‌బాషాను అభినందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సురక్షిత దినోత్సవం సందర్భంగా జానకి జనరల్ ఫ్యాక్టరీ సీనియర్ మేనేజర్ అన్వర్ భాష ఉత్తమ ప్రతిభకు అవార్డు అందుకున్నారు. అద్భుతమైన పనిసామర్థ్యాన్ని పరిపాలన రంగంలో ఆయన సాధించిన విజయాల గురించి కర్ణాటక ప్రభుత్వం అవార్డు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తిప్పే రుద్ర సుంకన్న, శివరాజ్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో జేడీ స్వామి, నాగశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులే..

సిరుగుప్ప, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థి భవిష్యత్తు ముందుకెళ్లాలంటే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎస్సీ, ఎస్టీ విద్యాసంస్థ వ్యవస్థాపకులు అవినాష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం ఎస్ఈఎస్ విద్యాసంస్థలో డీఈడీ విద్యార్థుల స్నేహ సమ్మేళనం, రిటైర్డ్ ఉపాధ్యాయులకు గురువందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని డీఈ అవినాష్ ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు భవిష్యత్తు చదువుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ భవిష్యత్తు రూపొందించుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభతో తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు చక్కగా చదువుకుంటే ముందురోజుల్లో భవిష్యత్తు అంచెలంచెలుగా ఎదుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ముఖ్య ఉపాధ్యాయురాలు అన్నమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



అలంకరణలో సీతారామ లక్ష్మణులు

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

హోసూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని పెరుమాల్ ఆలయాలు, రామాలయాలు కృష్ణ ఆలయాలలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. నేతాజీరోడ్డులోని కోదండరామస్వామి ఆలయం, బాగలూరు రోడ్డులోని కృష్ణ ఆలయం, కొండపై పెరుమాళ్ ఆలయం, ప్రసన్న వెంకటేశ్వర ఆలయం, కృష్ణగిరి జిల్లాలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ధార్మిక కార్యక్రమాలు సాగాయి. కోదండరామ ఆలయ కార్యక్రమంలో ఎంపీ గోపినాథ్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు. ఆలయాలలో మజ్జిగ, పానకం, పెసరపప్పు పంపిణీ చేశారు.

గ్రానైట్ క్వారీలో పేలుడు.. ఒకరి మృతి



వెంకటేశ్(ఫైల్)

రాయచూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా మాకాపూర్ సమీపంలో నిర్వహిస్తున్న ఒక ప్రైవేటు గ్రానైట్ క్వారీలో ఆదివారం ఉదయం పేలుడు సంభవించినట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ పేలుడులో కార్మికుడొకరు మృత్యువాతపడగా మరొకరికి తీవ్ర గాయాలైనట్లు కార్మిక వర్గాలు తెలిపాయి. చవిపోయిన కార్మికుడు బాగలకోట ప్రాంతానికి చెందిన వెంకటేశ్(38)గా తెలిపారు. మరొకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. సంఘటన జరిగిన వెంటనే సమాచారం అందకున్న లింగసుగూరు పోలీసులు గ్రానైట్‌ను పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా ప్రస్తుతం మాకాపూర్‌లో నిర్వహిస్తున్న గ్రానైట్‌కు భూగర్భ ఖనిజ శాఖల నుంచి ఎలాంటి అనుమతి లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.



నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ప్రధాని పర్యటనపై కాంగ్రెస్ నిరసన

హోసూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ రామేశ్వరం పర్యటనను ఖండిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పంబన్ వంతెనను ప్రారంభించడానికి ప్రధానిమోదీ ఆదివారం విచ్చేశారు. ఇందులో భాగంగా కృష్ణగిరి పశ్చిమజిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హోసూరు రాంనగర్‌లోని అన్నా విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. నగర మాజీ అధ్యక్షుడు నీలకంఠన్ అధ్యక్షత వహించగా కౌన్సిలర్‌లు భాగ్యలక్ష్మి, సూర్యగణేశ్, అక్బర్‌తోపాటు స్థానిక ప్రముఖులు మునిరాజ్, సాగర్, అన్బునాథన్, లాజర్, శంకర్, రాజవర్ధన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.1.50




టమోటాను పారబోస్తున్న రైతు

కృష్ణగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పేదవాడి యాపిల్‌గా ఉన్న టమోటా ధర క్రమేపీ పడిపోయింది. ఇదివరకు కిలో రూ.20 పలకగా ప్రస్తుతం రూ.1.50 మాత్రమే ఉండడంతో నష్టపోతున్నట్టు రైతులు విచారం వ్యక్తం చేశారు. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, బాగలూరు, బేరికై, కెలమంగలం తదితర ప్రాంతాలలో సుమారు 3వేల ఎకరాలలో టమోటా సాగు అవుతోంది. స్థానిక మార్కెట్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోనే కాక సమీపంలోని కర్ణాటక ప్రాంతానికి ఎగుమతి చేస్తారు. రెండు మూడు రోజులుగా టమోటా పంటను రోడ్ల పక్కన, చెరువులలోకి పడేస్తున్నారు. ఈ తరుణంలో టమోటా పంటకు కనీసగిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

విలియమ్ వర్డ్స్‌వర్త్ (జయంతి)




విలియమ్ వర్డ్స్‌వర్త్ 1770 ఏప్రిల్ 7న జన్మించారు. ఆంగ్లకవులలో ఎంతో పేరొందారు. 'పోయెట్ ఆఫ్ హ్యూమానిటీ'గా గుర్తింపు పొందారు. ప్రకృతితో మానవ సంబంధాలు, శృంగార అంశాలతో కూడిన రచనలు చేశారు. 'ద సొలిటరీ రీపర్, 'రెసొల్యూషన్ అండ్ ఇండిపెండెన్స్' తదితర రచనలు ఎంతో పేరొందాయి. ఆంగ్ల సాహిత్యంలో తనకో అధ్యాయాన్ని సృష్టించుకున్నారు. 'ఇంగ్లండ్ కవి గ్రహీత'గా పేరొందారు. 1850 ఏప్రిల్ 23న కన్నుమూశారు.

పండిట్ రవిశంకర్ (జయంతి)



'భారతరత్న' గ్రహీత సితార్ సంగీత విద్వాంసులు పండిట్ రవిశంకర్ 1920 ఏప్రిల్ 7న బెంగాల్ రాష్ట్రం గాజీపూర్‌లో జన్మించారు. ఆయన అసలుపేరు రబింద్రో శాంకర్ చౌదరి. సితార్ వాయిద్యం ద్వారా అనేక ప్రయోగాలు చేసి ప్రపంచ వ్యాప్తంగా సంగీత కచేరీలు, ప్రదర్శనలు ఇచ్చారు. మూడు సార్లు గ్రామీ పురస్కారం, పద్మభూషణ్, కాళిదాస్ సమ్మాన్, రామన్ మెగసెసె పురస్కారం అందుకున్నారు. 2012 డిసెంబరు 11న కన్నుమూశారు.

కాపు రాజయ్య (జయంతి)



కాపు రాజయ్య మెదక్ జిల్లా సిద్దిపేటలో 1925 ఏప్రిల్ 7న జన్మించారు. హైదరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చిత్రకళలో డిప్లమో, డ్రాయింగ్‌లో మద్రాస్ ప్రభుత్వ డిప్లమో పొందారు. లలిత కళా అకాడమీ ద్వారా చెకోస్లోవేకియా, హంగేరి, రుమేనియా, బల్గేరియా దేశాల్లో ప్రదర్శనలు చేశారు. జేఎన్‌టీయూ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 50 దాకా అవార్డులు వచ్చాయి. రాష్ట్రప్రభుత్వం ఆయనను రజతపత్రం, తామ్రపత్రంతో, చిత్రకళాప్రపూర్ణ పేరిట సత్కరించింది. కళా ప్రవీణ, కళావిభూషణ్, హంస, లలిత కళారత్న, సీనియర్ ఫెలోషిప్ అవార్డులు అందుకున్నారు. ఆయన గీసిన చిత్రాలు పార్లమెంట్ హౌస్, న్యూఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్, సాలార్జంగ్ మ్యూజియంలోనూ ఉంచారు. ప్రత్యేకించి నకాషి శైలిలో వడ్డెర మహిళ, ఎల్లమ జోగి, గోపికా కృష్ణ, పంట పొలాలు, వసంత కేళి, కోలాటం, బోనాలు, బతుకమ్మల నేపథ్యంతో ఉండేవి. 2012 ఆగస్టు 20న కన్నుమూశారు.

జాకీచాన్ (పుట్టినరోజు)



జాకీచాన్ 1954 ఏప్రిల్ 7న హాంగ్‌కాంగ్‌లో జన్మించారు. ప్రపంచవ్యాప్తంగా సినీ నటుడిగా గుర్తింపు పొందారు. మార్షల్ ఆర్టిస్ట్‌గా, నటుడిగా, స్టంట్ మ్యాన్‌గా, దర్శకుడిగా, కొరియో గ్రాఫర్‌గా, గాయకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. బాల్యంలోనే సినీరంగంలో అడుగుపెట్టి ఇంతవరకు 150కుపైగా సినిమాలలో నటించారు. ఫైటింగ్‌లలో భిన్నత్వం, ఆధునాతన ఆయుధాలు, సున్నితమైన హాస్యం, సరికొత్త స్టంట్స్‌కు పెట్టిందిపేరు. కుంగ్‌ఫూలో తర్ఫీదు పొందిన ఆయన 'హాంగ్‌కాంగ్ అవెన్యూ ఆఫ్ స్టార్స్', 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్' తదితర పురస్కారాలు అందుకున్నారు.



బంగారపేటలో శ్రీరామనవమి సంబరం



శిడ్లఘట్టలో ఆంజనేయస్వామికి అలంకరణ



బాగేపల్లిలో ప్రసాదం పంపిణీ



శివాజీనగర్ రామాంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయుడికి రజతకవచ అలంకరణ

ఉపసభాపతి రఘురామకృష్ణరాజుకు సన్మానం



రఘురామకృష్ణరాజు, సాయికుమార్‌ను సత్కరిస్తున్న రవిచందర్, రమేశ్‌రాజు తదితరులు



బలుసు శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఏపీ డిప్యూటీ స్పీకర్

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో రెండు రోజుల పర్యటనకు విచ్చేసి ఉగాది ఉత్సవాలలో పాల్గొన్న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును ఆదివారం పలువురు సత్కరించారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ రమేశ్‌రాజు, నందన గ్రూప్ హోటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ రవిచందర్‌లు సత్కారం చేశారు. రాజుక్షత్రియసంఘం ముఖ్యులు భాగస్వాములయ్యారు. ఇదే సందర్భంగా బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ సీఎండీ బలుసు శ్రీనివాసరావును డిప్యూటీ స్పీకర్ శాలువాతో సత్కరించారు.

పాఠశాలలో పండించిన కూరగాయలు సీఎంకు..



సీఎంతో విద్యార్థుల బృందం

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బెళ్తంగడి తాలూకా కొత్లూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ పాఠశాల ఆవరణలో తామే స్వయంగా పండించిన పలు రకాల కూరగాయలు, పండ్లను ముఖ్యమంత్రికి అందచేశారు. నగరంలోని సీఎం కావేరి నివాసంలో ఆదివారం ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులు అందచేశారు. చిన్నారుల కార్యవైఖరిని సీఎం ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రెండు కంప్యూటర్లను బహూకరించారు. కార్యక్రమంలో సీఎం మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్, బెళ్తంగడి కాంగ్రెస్ యువ నాయకుడు రక్షిత్ శివరాం తదితరులు ఉన్నారు.

జైలులో జామర్‌తో సమస్య.. బీజేపీ నిరసన

బెంగళూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మంగళూరు జైలులో ఏర్పాటు చేసిన జామర్‌తో ఈ ప్రాంతంలో మొబైల్లు పనిచేయడం లేదని తద్వారా నిరంతరం సమస్య ఎదుర్కోవాల్సి వస్తోందని మంగళూరు నగర దక్షిణవిభాగం కార్యకర్తలు జైలు ఎదుట శనివారం నిరసన తెలిపారు. జైలు లోపల ఉండేవారికి నెట్‌వర్క్ లభిస్తోందని కానీ బయట మాత్రం ఇబ్బంది పడుతున్నామని నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని జైలుశాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జైలులోకి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అదుపులోకి తీసుకుని ఆ తర్వాత వదిలేశారు. లీలావతి ప్రకాశ్ అనే కార్యకర్త అస్వస్థతకు గురి కావడంతో ఆసుపత్రికి తరలించారు. నిరసనలో మంగళూరు దక్షిణ ఎమ్మెల్యే వేదవ్యాసకామత్ తదితరులు పాల్గొన్నారు.



భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఛైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

కల్యాణ వైభోగమే...

» వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు



జయనగర్ సిద్దాపుర గుట్టేపాళ్యలో మూలవిరాట్టుకు అలంకరణ

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా రామాలయాలు, ఆంజనేయ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొప్పళలోని అంజనాద్రి కొండపై జరిగిన నవమి వేడుకలకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచి భక్తుల సందడి ప్రారంభమైంది. ప్రతిచోటా సీతారామాకల్యాణోత్సవాలు జరిగాయి. సాయంత్రం ఊరేగింపులు కొనసాగాయి. బెంగళూరులోని గాలి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి ఉదయం నుంచి రాత్రిదాకా కొనసాగింది. హనుమంతనగర్‌లోని రామాంజనేయగుడ్డపై జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. యవతులు కళాబృందాలు నృత్యప్రదర్శనలు చేశారు. రాగిగుడ్డ ఆంజనేయ స్వామి ఆలయంలో దర్శనాలకోసం భక్తులు క్యూ కట్టారు. రాజాజినగర్ ఇస్కాన్ మందిరంలో ముఖ్యులు మధుపండితదాస ఆధ్వర్యంలో నగర సంకీర్తనలు కొనసాగాయి. గిరినగర్‌లోని రాఘవేశ్వరమఠంలో సీతారాములకు అలంకరణ అనంతరం భక్తబృందంచే కుంకుమార్చన నిర్వహించారు. నవమి వేడుకలను పురస్కరించుకుని వాడవాడలా పానకం, మజ్జిగ, వడపప్పు పంపిణీ చేశారు. వందలాది ప్రదేశాలలో పంపిణీలు కొనసాగాయి.

దొమ్మసంద్రలో...

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామంలోని 13వ వార్డులో గణపతి కాలభైరవ అనుగ్రహ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. నాగరాజు, బాబుల నేతృత్వంలో నవమి రెండో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వందలాదిమంది భక్తులకు పానకం, మజ్జిగ, పెసరపప్పు సహా అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం కూడళ్ల లో వాహనచోదకులకు మజ్జిగ, పానకం పంపిణీ చేయడం విశేషం. దొమ్మసంద్ర గ్రామపంచాయతీ సభ్యులు పునీతమ్మ, నవీన్, శంకర్, కార్తిక్ రెడ్డి, ఢిల్లీ బాబు, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారపేటలో..

బంగారపేట: తాలూకా లోని ఆలదమర వద్ద కరవే, ఆటో డ్రైవర్ల సంఘం, వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. డీకే హళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ సుమారు 20ఏళ్లుగా ఇక్కడ శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రామభజన, రామ నామం రాయడం, రాముడి ధ్యానంతో మంచి జరుగుతుందనే నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సభ్యులు రామణ్ణ, బాబు, కరవే ప్రధాన కార్యదర్శి మునిరాజు, ప్రముఖులు కరుణామూర్తి, చంద్రణ్ణ, జ్యోతిలింగు తదితరులు పాల్గొన్నారు.



జడేనహళ్ళిలో వీరాంజనేయస్వామి

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఆదివారం సంబరంగా జరిగాయి. చింతామణిరోడ్డులోని యోగి నారేయణ యతీంద్రనగర్‌లో బలిజసేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. యోగి నారేయణ తాతయ్య 98వ ఉట్లు ఉత్సవం, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణంలోని కోటె ఆంజనేయస్వామి, మయూర సర్కిల్‌లోని ఆంజనేయస్వామి, అప్పేగౌడనహళ్ళి గేట్ వద్ద బయలాంజనేయస్వామి తదితర ఆలయాలలో విశేషపూజలు నిర్వహించారు. చౌడసంద్ర గ్రామంలోని వ్యాసరాయల కాలం నాటి ఆంజనేయస్వామి దేవాలయంలో అఖండరామకోటి నిర్వహించారు. స్వామివారికి 101 లీటర్ల పాలతో అభిషేకం, గంధంతో అభిషేకం జరిపారు. తాలూకా వ్యాప్తంగా పలుచోట్ల సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా ఊరేగించారు.

శాంతిధామలో సీతారాముల కల్యాణోత్సవం

బొమ్మనహళ్ళి: శ్రీరామనవమిని పురస్కరించుకుని అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతి ధామలోని షిర్డీసాయిబాబా ఆలయంలో సీతారామ కల్యాణోత్సవం నిర్వహించారు. భద్రాచలంలో నిర్వహించే తరహాలో ఆదివారం కార్యక్రమాలు కొనసాగాయి. 9జంటలు సీతారాముల తరపున పాల్గొనడం విశేషం. 13 సంవత్సరాలుగా ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ కార్యదర్శి తాతయ్యగుప్త తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఇదే సందర్భంగా ఉచిత మజ్జిగ పంపిణీ సేవను లాంఛనంగా ప్రారంభించారు. 10.30 నుంచి 12.30 వరకు, తిరిగి 2 నుంచి 4గంటల వరకు మజ్జిగ పంపిణీ ఉంటుందన్నారు. పరిమళ అగర్బత్తీ ఎండీ సుంకు జగన్నాథ్ సహకారం అందిస్తున్నారన్నారు. వేసవికాలం వరకు ప్రతిరోజూ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆలయ ట్రస్టు పదాధికారులు కృష్ణయ్యశెట్టి, మనోహర్ గుప్త, వెంకటేశ్‌గుప్త, సత్యనారాయణ శెట్టి, సేవాదళ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. సాయి సంతోషిమాతా చారిటబుల్ ట్రస్టు, సాయిసేవారక్షా ఫౌండేషన్ సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాయి.



హనుమంతనగర్‌లో భక్తుల ఊరేగింపు

హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో

హెచ్ఎస్ఆర్ లే అవుట్ పరంగిపాళ్యలోని శ్రీరామ సర్కిల్‌లో స్థానికులు ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీతారామ చిత్రపటానికి పూజలు చేశారు. వందలాదిమందికి మజ్జిగ, పానకం, పెసరపప్పు, చెరుకురసం పంపిణీ చేశారు. హెచ్ఎస్ఆర్ బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, కేపీసీసీ ప్రచార సమితి సభ్యుడు కే వాసుదేవరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగాయి.

హూడిలో శోభాయాత్ర

మహదేవపుర: జనసహాయోగ్ సంఘటన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని హూడిలో శ్రీరామనవమిని పురస్కరించుకుని శోభాయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బీర్ బహద్దూర్‌సింగ్ మాట్లాడుతూ యుగపురుషుడిగా శ్రీరాముడిని కొలుస్తారన్నారు. ఏడేళ్లుగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీరాముడి రథయాత్ర రాజపాళ్య, హోప్‌ఫాం, వైట్‌ఫీల్డ్, వర్తూరుకోడి, మారతహళ్ళి తదితర ప్రాంతాలలో పది కిలోమీటర్లకు పైగా బైక్‌ర్యాలీ సాగింది. ఉత్సవంలో మహదేవపుర పట్టణ హోబళి బీజేపీ అధ్యక్షుడు హూడి పిళ్ళప్ప, సంఘం ఉపాధ్యక్షుడు తానేకుమార్, కోశాధికారి పంకజ్ ఠాకూర్, పదాధికారులు అజయ్‌శర్మ, మనోజ్‌సింగ్, అజిత్‌సింగ్, సంజయ్‌సింగ్, అనూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముళబాగిలులో...

ముళబాగిలు: ముళబాగిలు పట్టణంలోని జయలక్ష్మి థియేటర్‌రోడ్డులో దుకాణ యజమానుల సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. సీతారాముల చిత్రపటానికి పూజల అనంతరం శ్రీరామనామ స్మరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు మజ్జిగ, పానకం, పెసరపప్పు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు ఎం కృష్ణప్ప, కార్యదర్శి రఘు, డైరెక్టర్లు మంజునాథ్, భాస్కర్, సోమణ్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

చేళూరులో...

చేళూరు: చేళూరు తాలూకా పరిధిలోని అన్ని గ్రామాలలో శ్రీరామనవమి సందర్భంగా పలు ఆలయాలలో వేడుకలు జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామివార్ల ఊరేగింపు జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: శ్రీరామనవమిని పురస్కరించుకుని పట్టణంలో పలు వేడుకలు జరిగాయి. పాతకోర్టు రోడ్డులోని పార్థసారథి ఆసుపత్రి సర్కిల్‌లో మజ్జిగ, పానకం, పెసరపప్పు పంపిణీ చేశారు. చైత్రటైమ్స్ యజమాని, బీజేపీ నాయకుడు వెంకటేశ్ మాట్లాడుతూ మహావిష్ణువు అవతారమైన శ్రీరాముడు యుగపురుషుడిగా ఉన్నారన్నారు. శ్రీరామచంద్రుడి ఆదర్శాలు అన్ని కాలాలకు అన్వయమన్నారు. ఈ సందర్భంగా కేసీ వెంకటరవణ, ఆదినారాయణ, మెడికల్ మనోజ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో...

చింతామణి: శ్రీరామనవమిని పురస్కరించుకుని పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు సాగాయి. కాగా పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ప్రముఖ కూడళ్లలో సీతారాముల చిత్రపటాలకు పూజలు నిర్వహించాయి. ఏపీఎంసీ మార్కెట్‌లో కూలి కార్మికులు ఆధ్వర్యంలో వీరాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అప్పు యువజన బళగ ఆధ్వర్యంలోనూ, వీరాంజనేయస్వామి ట్రస్టు, మారుతి యువజనసంఘం ఆధ్వర్యంలో సొణ్ణశెట్టిహళ్ళిలో వేడుకలు జరిగాయి.



చింతామణి ఏపీఎంసీ మార్కెట్‌లో అన్నదానం



రాఘవేంద్రస్వామి మఠంలో భక్తులు



దొమ్మసంద్రలో శ్రీరామనవమి వేడుకలు



అరికెరెలో విశేషపూజల్లో భక్తులు